ప్రజాశక్తి
శనివారం 24 ఆగస్టు 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు
చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జోన్ 1 సూపర్‌వైజర్ వినయ్ , స్థానిక లింక్ వర్కర్ మెడబలిమి. బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పలుకూరు గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది. నేటి యువత ఎక్కువగా వ్యసనాలకు బానిస అయి చెడిపోతున్నారు. అంతేగాక వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ముఖ్యంగా హెచ్ ఐ వి వ్యాధి పట్ల అవగాహన చాలా అవసరమన్నారు. డ్రగ్స్, వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు.కార్యక్రమంలో ఎఎన్ఎం కార్య కర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దొంగలు పడ్డ ఐదేళ్లకు..!

- రియల్టర్లలో వణుకు
- నగరంలో 40 లేఅవుట్స్‌కు నోటీసులు
- జిల్లా వ్యాపితంగా ఇదే పరిస్థితి

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లోని అక్రమ లేవుట్లకు భారీ షాక్ ఇచ్చింది. ఎన్నో ఏళ్లు ఎలాంటి అనుమతులూ లేకుండా భూ క్రయ, విక్రయాలు జరుపుతూ, రిజిస్ట్రేషన్లు చేస్తూ, ప్రభుత్వ భూములు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగాయి. మొన్న టిడిపి, నిన్న వైసిపి, నేడు టిడిపి ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాపితంగా కోట్ల రూపాయలు వ్యాపారాలు సాగాయి. భారీ భవన నిర్మాణాలు జరిగాయి. రోడ్లు, మౌలిక సదుపాయాలు పూర్తి చేశారు. కొన్ని చోట్ల అక్కడక్కడా మాత్రమే ఖాళీ ప్లాట్స్ ఉండగా, అనేక చోట్ల ఇంటి నిర్మాణాలు పూర్తి చేశారు. దొంగలు పడ్డ ఐదేళ్లకు కుక్కలు మొరిగినట్లు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నెల్లూరు రూరల్, నగర పరిధిలో 40 లేవుట్స్‌కు నోటీసులిచ్చారు. జిల్లా వ్యాపితంగా ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. దీంతో రియల్టర్లలో వణుకు ప్రారంభమైంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
రాష్ట్ర ప్రభుత్వం అక్రమ లేఅవుట్‌పై కొరడా ఝుళిపించింది. ఎన్నో ఏళ్ల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం అక్రమాల దారిలోనే నడుస్తున్నాయి. నుడా, మున్సిపాలిటీ, పంచాయతీల పరిధిలో సక్రమైన పత్రాలు లేకుండా, ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా, నియమ, నిబంధనలు పాటించకుండా ఇంటి ప్లాట్లు క్రయ, విక్రయాలు సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్లు చకచక అయిపోతున్నాయి. అప్పట్లో టిడిపి, ఇటీవల వైసిపి, నేడు టిడిపి ప్రభుత్వంలో ఈ తంతు సాగుతోంది. అడ్డదారుల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. నుడా పరిధిలో సుమారు 217 వరకు అక్రమ లేఅవుట్లు ఉన్నాయని గుర్తించారు. నూతనంగా టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ నుడా పరిధిలో జరిగిన అవినీతిని వెలికి తీయడానికి ముగ్గురు అధికారులను నియమించారు. నెల రోజుల పాటు విచారణ జరిపి ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. నెల్లూరునగరం, రూరల్ పరిధితోపాటు, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం, కావలి, ఆత్మకూరు,తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. నెల్లూరు రూరల్ పరిధిలోని అల్లీపురం వద్ద ఇరిగేషన్ భూములు ఆక్రమించి ప్లాట్లు వేసి, అమ్మకాలు చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకున్నా ఆగలేదు. నియమ నిబంధనలు ఏ మాత్రమూ పాటించకుండా అడ్డదిడ్డంగా ప్లాట్లు ఏర్పాటు చేసి, అమ్మకాలు చేశారు. 40 అడుగుల రోడ్లకు 30 అడుగులు చేసి, సామాజిక అవసరాల కోసం కేటాయించాల్సిన భూమిని ప్లాట్లు చేసి అమ్మకాలు చేశారు. రియల్ ఎస్టేట్ రంగంలో అడ్డదిడ్డంగా కోట్ల రూపాయలు గడించారు. అధికారులు, కొందరు రాజకీయ నేతల అండదండలతో ఇదంతా సాగిపోయింది.

లేఅవుట్ వద్ద స్థల వివాదం జరుగుతోన్న దృశ్యం

దొంగలు పడ్డ ఐదేళ్లకు..!
రియల్ ఎస్టేట్ రంగం ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దానిని మచ్చిక చేసుకొని తమ వ్యాపారాలు కొనసాగిస్తుంది. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాల్లోనూ ఇదే సాగింది. ఇప్పటికే నెల్లూరు నగరంలో వందల లేఅవుట్స్‌లు అమ్మకాలు చేశారు. భారీ భవన నిర్మాణాలు చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. వందలాది మంది కాపురాలుంటున్నారు. తాజాగా గురువారం నెల్లూరు మున్సిపల్ అధికారులు 40 లేఅవుట్స్ పేర్లతో ప్రకటన విడుదల చేశారు. ఇక్కడ ఎవరూ ప్లాట్లు కొనవద్దని, అమ్మొద్దని, రిజిస్ట్రేషన్స్ జరగవని, మౌలిక సదుపాయాలు కల్పించమని ప్రకటించారు. ఇప్పటికే అనేక మంది ఇక్కడ ప్లాట్లు కొని, ఇళ్ల నిర్మాణాలు చేశారు. ఇప్పుడు మున్సిపల్ అధికారుల ప్రకటనతో ఒక్కసారిగా ఆందోళన చెందుతున్నారు. మంత్రి పి. నారాయణ తొలుత నెల్లూరు మున్సిపాలిటీ పరిధిలో నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో నోటీసులు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు టిడిపి నేతలు ఆశ్రయిస్తున్నారు. తమను కాపాడాలని, వ్యాపారాలు దెబ్బతింటాయని ప్రాధేయ పడుతున్నారు. ఎప్పుడో జరిగిన తప్పునకు అపరాధ రుసుము వసూళ్లు చేసి, ప్రభుత్వం ఆదాయం పెంచుకోవాలని, మళ్లీ ఇలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కొందరు కోరుతున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కోర్టును ఆశ్రయించడానికి సిద్ధమవుతున్నారు.

చెక్కు అందజేస్తున్న వేమిరెడ్డి దంపతులు

వేమిరెడ్డి దంపతులు విరాళం అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని జనహిత వాత్సల్య సంస్థకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు ప్రతేడాదిలానే ఈ సంవత్సరం రూ.5లక్షల విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఎంపి నివాసంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ విరాళ చెక్కును సంస్థ కార్యదర్శి జివి సాంబశివరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ గత 36 ఏళ్లుగా వాత్సల్య సేవా సంస్థకు వేమిరెడ్డి దంపతులు ఆర్థిక సహాయం అందిస్తూ అన్ని విధాలా అండదండలు అందిస్తున్నారని చెప్పారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-నెల్లూరు: విద్యుత్ సబ్‌స్టేషన్లలో పలు మరమ్మతుల చేపట్టనున్న నేపథ్యంలో నేడు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర ఏఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి గోమతి నగర్ సబ్ స్టేషన్ లోని 11 కెవి ఇండోర్ ఫీడర్ నందు కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కారణంగా ఉదయం 9:30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. ఈ విద్యుత్ సరఫరా నిలుపుదల కారణంగా ఇస్కాన్ సిటీ నందు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

విరాళం అందజేస్తున్న దాత

కేరళ వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

ప్రజాశక్తి-నెల్లూరు నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ సిపిఎం సీనియర్ నాయకులు,మాజీ కౌన్సిలర్ మాదాల శ్రీమన్నారాయణ కేరళ వయనాడ్ వరద బాధితుల సహా యార్థం విరాళాలు సేకరణ చేసి రూ.21వేల నగదును నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులకు అందజేశారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో నిర్వహిం చిన ఓ ఈ విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో పి. సూర్యనారాయణ, టి.నారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు ప్రాణరక్షణ కల్పించాలి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్

ప్రజాశక్తి-నెల్లూరు జిల్లాలోని పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రాణ రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురంలోని ఫార్మా ఇండస్ట్రీలో ప్రమాదం జరిగి దాదాపు 17 మంది ప్రాణాలు కోల్పోవడం దారుణ మన్నారు.అంతే కాకుండా ఆ పరిశ్రమలో పనిచేస్తున్న అనేకమంది తీవ్రంగా గాయపడి వైద్యశాలల్లో చికిత్సలు తీసుకుంటున్నారన్నారు. అదే విధంగా జిల్లాలోని పంటపాలెం పామ్ ఆయిల్ ఫ్యాక్టరీలో బాయిలర్ ప్రేలుడు సంభవించడం, ఆ సమయంలో కార్మికులు ఎవరో లేకపోవడంతో ప్రమాదం తప్పడం సంతోషకరమన్నారు. ఈ ఘటనలు మరిచిపోక ముందే మరల అనకాపల్లి జిల్లాలో పరవాడలోని ఫార్మా కంపెనీలో బాయిలర్ పేలి నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడి వారి పరిస్థితి విషమంగా ఉండటం ఎంతో భాదాకరమన్నారు. ఇలా వరుసగా పరిశ్రమలలో జరుగుతున్న ఘటన లు అధికారుల నిర్లక్ష్యం వల్లనే, సరైన పర్యవేక్షణ లేకపోవడం వలన చోటుచేసుకుంటున్నాయన్నారు. గతంలో కార్మిక శాఖ అధికారులు నెలకు ఒకసారి పరిశ్రమలను తనిఖీలు నిర్వహించి లోపాలను సరిచేయాలని యాజమాన్యాలను హెచ్చరిస్తుండే వారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న ఘటనలు పరిశీలిస్తే తనిఖీలు నిర్వహించకపోవడం, కార్మిక శాఖలో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకపోవడం, లేబర్ డిపార్ట్మెంట్ కి ఎటువంటి అధికారాలు లేకుండా ప్రభుత్వాలు చట్టాలను మార్పు చేయడం వల్ల ఇటువంటి దారుణాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వరుసగా జరుగుతున్న ఘటనల పట్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం, కనీస కార్మిక శాఖ స్పందించక పోవడం దారుణమన్నారు.ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అనేక సెజ్ ల లోని పరిశ్రమలలో అనేక కార్మిక మరణాలు సంభవించాయి. జిల్లాలోని చంద్రపడియ ఫ్యాక్టరీలో ప్రతినిత్యం ప్రమాదాలు, మరణాలు చూస్తూనే ఉన్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలలో మార్పులు తెచ్చి తనిఖీలు చేసే నిబంధనలో పాటించమంటే ఫ్యాక్టరీలు తరలిపోతాయని సాగు చెప్పి ఫ్యాక్టరీస్ బాయిలర్ ఇన్స్పెక్టర్లు తప్పించుకుంటున్నారు. కొంతమంది కాసులకు కక్కుర్తి పడి పర్యవేక్షణ గాలికి వదిలేశారన్నారు.

నేడు ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా
నేడు ఉమ్మారెడ్డి గుంటలోని ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ కార్యాలయం వద్ద, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నా ఉద్దేశం ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో అలాగే మన జిల్లాలో పలు ఫ్యాక్టరీలలో వరుసగా జరిగే ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవడం మానివేశాయి. కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నిరంతరం తనిఖీలు చేయాల్సినటువంటి ఫ్యాక్టరీల శాఖ, లేబర్ డిపార్టెంట్లు ఆ పనిలో లేవని, ఇటీవల అచ్చుతాపురం ఘటన, అదేరోజు జిల్లాలో పంటపాలెం వద్ద పామాయిల్ ఫ్యాక్టరీ లో జరిగిన అగ్నిప్రమాదం, పరవాడ సెజ్ లో జరిగిన మరో ప్రమాదం ఇవన్నీ మేనేజ్మెంట్ల వైఫల్యం వల్లనే జరిగినట్టు తాము బావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు యాజమాన్యం, ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ మీద ధర్నా నిర్వహిస్తున్నా మన్నారు. కార్మికుల పెద్ద ఎత్తున ఉమ్మారెడ్డి గుంటలో గల ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ కార్యాలయంకు వచ్చి పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇండస్ట్రియల్ కారిడార్ కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, కె. పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమందించడమే ధ్యేయం

ప్రజాశక్తి-నెల్లూరు: వైద్యులు ఏపదవిలో ఉన్న ప్రజల ప్రాణ రక్షణకే కృషి చేస్తారని పి. హెచ్.పి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం, పొగతోటలో డాక్టర్ కృష్ణమూర్తికి జి.జి.హెచ్ లో అసోసియేట్ ప్రొఫెసర్ గా ప్రమోషన్ వచ్చిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డా.కృష్ణమూర్తి ఏపదవిలో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తిని శాలువా, పూల బొకేతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీ. హెచ్.పీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, గోరంట్ల శేషయ్య, నరసాపురం ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర కేసరి జయంతి

ప్రజాశక్తి-కందుకూరు: కోవూరు రోడ్డులోని ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహం వద్ద ఆంధ్ర కేసరి సేవా సమితి అధ్యక్షులు మంచిరాజు మురళీమోహన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆంధ్రకేసరి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంచిరాజు మురళి అధ్యక్షతన జరిగిన సమావేశం లో శాసనసభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు దేశ స్వాతంత్ర ఉద్యమానికి తన యావదాస్తిని రాసిన గొప్ప మహనీయులు అని అన్నారు. అటువంటి మహనీయులను మనమందరం స్మరించుకోవాలన్నారు. నేటి రాజకీయ నాయకులకు టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి అని అన్నారు. అటువంటి మహనీయులకు గుర్తుగా విజయవాడలో కష్ణా నది బ్రిడ్జికి ప్రకాశం బ్యారేజ్ అని, ఒంగోలు జిల్లాకు ప్రకాశం జిల్లా అని, ఒంగోలులో ఉన్న యూనివర్సిటీకి ఆంధ్ర కేసరి యూనివర్సిటీ నామకరణం చేశారని తెలిపారు. అనంతరం సేవాసమితి వారు ఎమ్మెల్యే ఇంటూరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కంధపురి బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ ఇప్పగుంట నాగరాజా రావు, ఘట్టమనేని హరిబాబు, విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, విశ్రాంత ప్రిన్సిపల్ ఇప్పగుంట మాధవరావు, ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, శ్రీ దత్తాత్రేయ ఆలయ ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు, గణపతిరాజు శేషగిరిరావు, కాకర్ల రాజగోపాల్, డాక్టర్ రాధాకృష్ణమాచార్యులు, వివిధ పార్టీల నాయకులు, ఆంధ్ర కేసరి అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు
కందుకూరు తిక్క వరకు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో తెలుగుజాతి గర్వించదగ్గ నాయకులు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహనీయుడు గురించి ఆంధ్ర కేసరి ఈ పేరు సాహసానికి మారుపేరు స్వాతంత్ర ఉద్యమానికి తులసి వేరు,పౌరుషానికి పెట్టింది పేరు. కార్యక్రమంలో అధ్యాపకులు తొట్టెంపూడి సుబ్బారావు పరుచూరి ఉష శిరీష బాబురావు సీతారావమ్మ భాస్కరరావు హజరత్తయ్య కట్టా సుబ్బారావు విద్యార్థినీ, విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు
బహుముఖ ప్రజ్ఞాశాలి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం జీవితం మనకు ఆదర్శం కావాలని జాయింట్ కలెక్టర్ కే. కార్తీక్ అన్నారు. ప్రకాశం జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ .లవన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరి పాలనాధికారి విజయ్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జెసి

ప్రజాశక్తి ఉలవపాడు:
ఉలవపాడు జీవీఎస్ ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రకాశం పంతులు 153 జయంతి కళాశాల చరిత్ర విభాగం అధ్యాపకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి ఎల్ సుధారాణి పాల్గొని మాట్లాడారు.

నేడు 'పిన్నెల్లి' విడుదల

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : మాచెర్ల మాజీ ఎంఎల్ఏ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఎపి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం సాయంత్రం విడుదల కావాల్సి ఉండగా బెయిల్ పేపర్లు ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. ఎన్నికల్లో ఈవిఎంల ధ్వంసం, తరువాత జరిగిన అల్లర్ల విషయంలో గుంటూరు కోర్టు ఆయనకు జైలు శిక్ష వేసింది. నెల్లూరు సెంటర్ జైల్లో ఆయన ఉన్నారు. ఈ విషయం శుక్రవారం ఎపి హై కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. విషయం తెలిసిన వెంటనే పిన్నెల్లి అనుచరులు పెద్దఎత్తున నెల్లూరు చేరుకున్నారు.వారితోపాటు గుంటూరుజిల్లా నరసారావుపేట నుంచి పోలీసులు భారీగా వచ్చారు. నెల్లూరు పోలీసులతోపాటు సుమారు వంద మంది పోలీసులు నెల్లూరు రావడం, వైసిపి నేతలు, కార్యకర్తలు జైలు వద్దకు రావడంతో కొంత ఉద్రికత్త నెలకొంది. మళ్లీ పిడి యాక్ట్ పెట్టి పిన్నెల్లి అరెస్ట్ చేయడానికి పోలీసులు వచ్చారన్న సమాచారంతో ఆయన అనుచరులు, వైసిపి నేతలు జైలు వద్దకు వచ్చారు. బుజబుజనెల్లూరు, పొదలకూరు రోడ్డు, జైలు వద్ద భారీగా పోలీసులు, జనం రావడంతో ఆ ప్రాంతంలో ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. సాయంత్రం 5.30 గంటల వరకు బెయిల్ పత్రాలు జైలు అధికారులకు అందకపోవడంతో ఆయన విడుదల నిలిచిపోయింది. నేడు ఆయనను జైలు నుంచి విడుదల చేసే అవకాశం ఉంది. మరో కేసులో గుంటూరు పోలీసులు అరెస్ట్ చేయడానికి నెల్లూరు వచ్చారనే ప్రచారం సాగుతోంది.

పనుల్లో పారదర్శకత కోసమే గ్రామసభలు

ప్రజాశక్తి-నెల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే పనుల్లో జరిగే అవినీతి, అక్రమాలను ఉపేక్షించబోమని, వాటిని నివారించేందుకు గ్రామ సభలు తమ ప్రభుత్వం నిర్వహిస్తుందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మనుబోలు మండలం పిడూరు, వెంకటాచలం మండలం కురిచెర్లపాడు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఏ సోమిరెడ్డి

విద్యార్థినికి అభినందనలు

పజాశక్తి-కందుకూరు: కందుకూరు శ్రీ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థిని పడిదపు నందిని ఇటీవల కడప జిల్లా పులివెందులలో జరిగిన సౌత్ జోన్ హాకీ జూనియర్ పోటీలలో బంగారు పతకం సాధించింది. తన ప్రతిభను గుర్తించి నేషనల్ స్పోర్ట్స్ హాకీ అధారిటీ వారు సౌత్ ఇండియన్ జూనియర్ హాకీ జట్టుకి ఎంపిక చేశారు. ఎంపికైన పడిదపు నందిని సెప్టెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరుగు హాకీ పోటీలకు సౌత్ ఇండియన్ జట్టు తరపున పాల్గొననుంది.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిహెచ్. రామకృష్ణారావు , టిఆర్ఆర్ జూనియర్ కళాశాల పిడి సుబ్బారావు , కళాశాల డైరెక్టర్ సిహెచ్ భరద్వాజ్ , కళాశాల ప్రిన్సిపల్ పి. గీతా శ్రీనివాసరావు , అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు నందినిని అభినందించారు. భవిష్యత్తులో ఇండియన్ టీంలో ఆడి దేశానికి, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కోరారు.

విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

కార్యకర్తలకు అండగా ఉంటా

ప్రజాశక్తి-కందుకూరు: మాజీ శాసనసభ్యులు కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గంలోని సమస్యలు అడిగి తెలుసుకుంటూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని తెలిపారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉలవపాడు ఎస్ఐగా అంకమ్మ

ప్రజాశక్తి-ఉలవపాడు : మండలం ఎస్ఐగా కె.అంకమ్మ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల భాగంగా ఇక్కడ పనిచేస్తున్న బాజీ రెడ్డి బదిలీపై వెళ్లగా అంకమ్మ ను ఇక్కడికి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలో అందరికీ న్యాయం చేస్తారని చట్టపరంగా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన శిక్ష తప్పదని పేర్కొన్నారు.

పలుచోట్ల గ్రామ సభలు

కందుకూరులో మాట్లాడుతున్న ఎంఎల్ఏ ఇంటూరి

వలేటివారిపాలెంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి ఇంటూరి

టిపి గూడూరులో

ముత్తుకూరులో

గుడ్లూరులో వ్యకాస.నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు
రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ గ్రామపంచాయతీ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఉలవపాడు మండలం, ఆత్మకూరు, కందుకూరు మండలం కొండముడుసుపాలెం గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్జీల రూపంలో ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం సర్పంచ్ లను కేవలం ఉత్సవ విగ్రహాలుగా చూసిందని సుమారు 1000 కోట్ల రూపాయల పంచాయతీ నిధులను దారి మళ్ళించిందని విమర్శించారు. కనీసం గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వీధిలైట్లు రిపేర్లు చేయటానికి కూడా నిధులు లేకుండా చేసి, గ్రామాల అభివద్ధిని గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలకు ప్రాణం పోసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇటీవల దాదాపు 1450 కోట్ల ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేశారని గుర్తు చేశారు.కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ, తహశీల్దార్ లావణ్య, డిఎల్‌పిఒ కృష్ణమోహన్, స్పెషలాఫీసర్ వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాళం గోవిందమ్మ, మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, స్థానిక నాయకులు అమరనేని రాములు, బెల్లం కష్ణమోహన్, మద్దసాని మహేంద్ర పాల్గొన్నారు.కొండముడుసుపాలెం కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీఓ వెంకటేశ్వరరావు ఏడిఏ అనసూయ, డి ఎల్ పి ఓ కృష్ణమోహన్, సర్పంచ్ తుమ్మా కోటేశ్వరమ్మ, ఎంపీపీ ఇంటూరి సుశీల, ఏపీడి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరు
గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం గుడ్లూరు మండల కమిటీ గుడ్లూరు లో జరిగిన గ్రామసభలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ వారు నిర్వహి ంచిన గ్రామసభలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. ఉపాధి హామీ పని దినాలు 100 రోజుల నుండి 200 రోజులకు పెంచాలని, రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు వారాల బిల్లులు వెంటనే చెల్లించాలని, పని ప్రదేశంలో మంచినీళ్ళ, మెడికల్ కిట్లు, పలుగు పారా, సరఫరా చేయాలని నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. అర్జీ సమర్పించిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దా మా కష్ణయ్య, పాలకుర్తి నాగేశ్వరరావు, కొనిదన మాలకొండయ్య, కందుల సుబ్బయ్య, బెజవాడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వలేటివారిపాలెం
మండలంలోని బడేవారిపాలెంలో పనికి వెళ్లిన వాళ్లకు రోజుకు రూ 120, పనికి వెళ్లని వాళ్లకు రోజుకు కూలీ మూడువందల రూపాయలా ఇదెక్కడ న్యాయం, పని కల్పించమని అడిగిన వెంటనే పని కల్పించాల్సి ఉంది. పని కల్పించమని డిమాండ్ పెట్టి 10 రోజులైనా కూలీలకు పని కల్పించకపోవడమేమిటి. పని కల్పించమని అడిగితే పనికి రావద్దంటూ చెప్పడమేమిటని జెడ్‌పిటిసి సభ్యురాలు ఇంటూరి భారతి మండల సర్వసభ్య సమావేశంలో ఉపాధిహామీ అధికారులను నిలదీసింది. వలేటివారిపాలెం మం డల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ సమావేశంలో జెడ్‌పిటిసి భారతి మాట్లాడుతూ కూలీలకు సమానవేతనం ఇవ్వకుండా ఇలా ఎందుకు చేస్తున్నారు.మీరే ఇలా చేస్తున్నారా లేక మీ పైఅధికారులు ఇలా చేయమన్నారా, లేక రాజకీయ నాయకులు చెబితే ఇలా చేస్తున్నారా సమాధానం చెప్పాలని నిలదీశారు. సమావేశంలో ఆమెతోపాటు ఎంపీపీ, పలువురు సభ్యులు నిలదీశారు. కూలీలకు సమాన వేతనం వేయకుండా వివక్ష చూపితే ఉపాధిహామీ ప్రాజెక్టు డైరెక్టరుకు పిర్యాదు చేస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో ఇలా జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వ హయంలోనే ఇలా జరుగుతుందని అసహనం వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే కూలీలపై ఇలాంటి రాజకీయాలు చేయకూడదని చెప్పారు.సమావేశంలో ఎంపీడీఓ శేషుబాబు, వైద్యాధికారిణి మణిదీపిక, విద్యుత్ ఏఈ మధుబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, పోకూరు పశువైద్యాధికారి వంశీ, పిఆర్ ఏఈ గోపిచంద్ రెడ్డి, ఇరిగేష్ ఏఈ ప్రసాద్, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, ఎంపీటీసీలు స్వర్ణ నరసింహం, చౌడబోయిన యానాది, వడ్లమూడి జయమ్మ, సర్పంచ్లు డేగా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముత్తుకూరు
ముత్తుకూరు మేజర్ పంచాయతీ సచివాలయం దగ్గర మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ జరిగింది.ఈ గ్రామ సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య పాల్గొని మాట్లాడారు.ముత్తుకూరు మండల కేంద్రమైన పంచాయతీలో కొత్త హరిజనవాడ పాత హరిజనవాడ కోనేటిమిట్ట గిరిజన కాలనీలు ఆదాల్ నగర్ పా దర్తిపాలెం, మిద్దరేవు, రామలింగాపురం, ఆర్ అండ్ ఆర్ కాలనీ ఇంకా అనేక ప్రాంతాలైన ఈ పంచాయతీ పరిధిలోని ప్రజలకి ఉపాధి హామీ జాబ్ కార్డులు లేవు. వీరందరికీ వెంటనే జాబ్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పని కోరిన వారు వెంటనే బ్యాంక్ అకౌంట్లో ప్రారంభించి ఆధార్ కార్డును లింక్ చేసుకొని అధికారులు ఇచ్చే ఫారం ను పూర్తిచేసి ఇచ్చిన 15 రోజుల లోపల పనులు చూపిస్తామని వారు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సిపిఎం ముత్తుకూరు శాఖ కార్యదర్శి చేవూరు మల్లికార్జున, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
ఉపాధి కూలీలకు పని దినాలు పెం చాలని సిపిఎం గ్రామ శాఖ కార్యద ర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. శుక్రవారం తోటపల్లిగూడూ రు మండలం నరుకూరులో ఉపాధి గ్రామ సభ జరిగింది. సభలో సిపి ఎం పార్టీ నరుకూరు గ్రామ శాఖ కా ర్యదర్శి మారుబోయిన రాజా ఉపా ధిహామీ పనులు కల్పించాలని కోరు తూ గ్రామ సెక్రటరీ మరియు ఉపాధి హామీ సిబ్బందికి వినతి పత్రం ఇవ్వ డం జరిగింది. ఈ సందర్భంగా సిపి ఎం పార్టీ మండల కార్యదర్శి వేగూ రు వెంకయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామ పంచాయితీ లు తీర్మానలు చేసి ఉ పాధి హామీ పనులు పెట్టాలన్నారు. కార్యక్రమం లో నరుకూరు శాఖ సభ్యులు ఆకుల రఘు, ఎస్. కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
స్థిరమైన అభివృద్ధి సాధనే మహాత్మాగాంధీ జాతీయ గ్రా మీణ ఉపాధి పథకం (ఎంకెఎన్ఎర్ఈ జిఎస్) ముఖ్యోద్దేశమని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ చినఓబులేసు పే ర్కొన్నారు. మండలంలో శుక్రవారం నుంచి ఉపాధి హామీ పథకం ప్రత్యేక గ్రామ సభలు ప్రా రంభమయ్యాయి. నరుకూరులో సర్పంచ్ అన్నం శారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా చినఓబులేసు మాట్లాడుతూ స్థిర మైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణకు ఈ పథకం ప్రాధాన్యత ఇస్తుందన్నారు.కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొణ తం. రఘుబాబు, అన్నం శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కౌసల్య, కార్యదర్శి అజిజ్, సచి వాలయ సిబ్బంది, ఉపాధి పథకం కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత కోసమే ప్రభుత్వం గ్రామస భలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ తిరుపతి పార్లమెంట్ ని యోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మన్నెం జితేం ద్ర గౌడ్ పేర్కొన్నారు. తోటపల్లిగూడూరులో శుక్రవారం ఎన్ఆర్ఇజిఎస్ గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జితేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అవినీతి, అ క్రమాలను ఉపేక్షించదని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో పనులు చేయకుండానే నిధులు స్వాహా చే శారని ఆరోపించారు.

బొల్లినేనితో ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డి సెల్ఫీ

ప్రజాశక్తి-కావలి

కావలి సెల్ఫీ పాయింట్‌ను ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డితో కలిసి ఉదయగిరి మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు శుక్రవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా వారిరువురు చిన్నారులతో కలిసి సెల్ఫీ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి, బొలినేని వెంకటరామారావు మాట్లాడుతూ జాతీయవాదాన్ని పెంపొందించేలా 100 అడుగుల జాతీయ జెండా చరిత్రను గుర్తుచేస్తూ మహనీయుల ఫొటో గ్యాలరీ అద్భుతంగా ఏర్పాటు చేసిన కావ్య క్రిష్ణారెడ్డిని అభినందిస్తున్నానన్నారు. కావలి అభివృద్ధి కావ్య క్రిష్ణారెడ్డితోనే సాధ్యమన్నారు. అనంతరం ఈ సెల్ఫీ పాయింట్ వల్ల కావలి ప్రజలందరూ ఇక్కడకు వచ్చి, ఫొటో గాలరిలో పెట్టిన ఫొటోల గురించి తెలుసుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఐకానిక్ ల్యాండ్ మార్క్‌ను తాను నిర్మించి, కావలి మున్సిపాలిటీకి అప్పజెప్పామని, ఎవరైనా ఇక్కడకు వచ్చి జాతీయతా భావాలు పెంపొందింప చేసుకోవచ్చున్నారు. మాజీ ఎంఎల్ఎ కూడా రేపు ఇక్కడకు వస్తారని మీడియా చెప్పగా, తనను అర్థం చేసుకుని, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అక్కడకు శనివారం వస్తానని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నానని, రెడ్ కార్పెట్ వేసి ఆయనను ఆహ్వానిస్తామని, ఈ జాతీయజెండా అందరికీ సంబంధించిందని, మాజీ ఎంఎల్ఎకు ఆయన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తికొండ కిషోర్ బాబు, జి.రాజ్‌కుమార్ చౌదరి, వల్లేరి వెంకటకిరణ్ కుమార్, కాకి ప్రసాదరావు, కావేటి చినకోటయ్య, తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చుక్కలదుప్పిని కాపాడిన అటవీ సిబ్బంది

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పడమటినాయుడుపల్లి సమీపంలోని పొలాల్లో దాహం తీర్చుకోవడానికి వచ్చిన చుక్కలదుప్పి చిచ్చెన బావిలో దిగి పైకి ఎక్కే మార్గం లేక బావిలో ఇరుక్కుపోయింది. అటుగా వెళ్లిన గ్రామస్థులు చూసి అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అటవీ, ఫైర్ సిబ్బంది విశ్వప్రయత్నం చేసి చుక్కల దుప్పిని ప్రాణాలతో బయటకు తీసి అడవిలోకి వదిలారు. గ్రామస్తుల సహకారం మరువలేనిదని అధికారులన్నారు.

బడిబయట విద్యార్థికి అడ్మిషన్

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో బడి బయట విద్యార్థులపై ఆ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అందులో భాగంగా పడమటి నాయుడుపల్లి గిరిజన కాలనీలోని బడిబయట విద్యార్థులను అనేక పర్యాయాలు కలసినా ఫలితం లేకపోయే సరికి, పాఠశాల ఉపాధ్యాయులు శివశంకర్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి నేరుగా వారు గొర్రెలు కాచే ప్రాంతానికి వెళ్లి, వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఆ విద్యార్థిని పాఠశాలకు రప్పించి కావాల్సిన విద్యాసామగ్రి అందించారు. బడిబయట విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలకు రప్పించిన శివశంకర్‌ను పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గామస్తులు అభినందించారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు గోళ్ళ.గుణవతిదేవి జయంతి సందర్భంగా శుక్రవారం వారి కుమారుడు - కోడలు డాక్టర్ జి.పార్థసారథి రాజు - డాక్టర్ ఉషారాణి, మనవరాలు డాక్టర్ జి.జాహ్నవి సహకారంతో సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో వృద్ధులకు చీరలు వితరణ చేసి భోజనం ప్యాకెట్లు అందజేశారు. అలాగే సంయుక్త సేవా కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు అల్పాహార భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాత డాక్టర్ ఉషారాణి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని వృద్ధులకు చీరలు, భోజనం ప్యాకెట్లు అందజేశారు.

నెలవారీ లక్ష్యాలపై సెక్టార్ సమీక్ష

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో శుక్రవారం స్థానిక వ్యాక్సినేషన్ కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సిబ్బంది ఎంతవరకు సాధించారు అనే అంశాలపై సమీక్ష నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు ఎస్.వినిత, ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య, సిహెచ్ శివ కుమారి పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్తసేకరణ రిక్షాలు..

- రూ.లక్షల ప్రజాధనం వృథా

ప్రజాశక్తి - వరికుంటపాడు

మండలంలో గ్రామీణ వాసులు చెత్త పోయడానికి ఏర్పాటు చేయాల్సిన కుండీలు, వ్యర్థాలను తరలించే తోపుడు బండ్లపై మట్టిని, దుమ్మును తొలగించే మెరుగునకు పరిశుభ్రతకు వినియోగించాల్సిన ఇలాంటి పరికరాలు, వాహనాలు నిరుపయోగంగా మూలన పడిపోయాయి. స్వచ్ఛ గ్రామీణ ప్రాంతాల్లో క్లీన్ సమస్య ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో చూపడం లేదు. గ్రామీణ అభివృద్ధి పథకంలో తీర్చిదిద్దుతుంటే నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తుంది. ఇక నుంచి చెత్త సేకరణ, డస్ట్‌బిన్ రహిత నగరం అనే నినాదంతో రోడ్లపై చెత్త కుండీలను తొలగించాలని కానీ నూతనవిధానాన్ని పట్టించుకోకుండా పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిర్వహణ లోపం కారణంగా తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుతున్నాయి. పలువురు సమీపంలోని వ్యక్తి మూలపడి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'జెబి'లో జాతీయ అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి-కావలి

స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సి.వి సుబ్బారావు మాట్లాడుతూ 23న చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ సేఫ్‌గా సాఫ్ట్‌గా చంద్రుని దక్షిణ ధ్రువంలో ల్యాండ్ అయిన సందర్భంగా ఆగస్ట్ 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్బారావు నాయుడు మాట్లాడుతూ చంద్రుని దక్షిణ ధృవం మీద ప్రజ్ఞాన్ రోవర్ చేరుకొనుట ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం విజయవంతంగా ప్రదర్శించిన దేశాలలో మొదటి స్థానంలో ఉన్నదని, అంతరిక్ష పరిశోధనలో నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని తెలియజేశారు. ఇదేవిధంగా స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ ఇంజనీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్) వంటి సబ్జెక్ట్‌లో చదివి, యువకులందరూ ఆలోచనలను, నైపుణ్యాలను పెంపొందించుకొని తద్వారా దేశ అభివృద్ధి పథంలో పయనిస్తుందని వివరించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం ప్రతిఒక్కరు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సి.వెంకటేశ్వర్లు స్పేస్ డే లో స్లోగన్స్ పలికించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు.

ప్రజాశక్తి-వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో చంద్రయాన్ త్రీ మిషన్ విజయవంతమై ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం చంద్రుడని తాకేటప్పుడు జీవితాలను తాకడం ఇండియన్ స్పేస్ సాగా అనే అంశంపై వీసి ద్వారా నిర్వహించబడిన ఉపన్యాస వ్యాసరచన పోస్టర్ మేకింగ్ పోటీలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులందరికీ అతిథులు బహుమతులు పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.సుమన్ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల ద్వారా అందుకున్న పురస్కారులతో భాస్కరరావు గారు నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ మాజీ డైరెక్టర్ మరియు ఎస్‌ఎఓ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.జి.పిద్దే నారాయణరావు గారు ఆయన ప్రత్యేకంగా ఉపన్యసించారు. నివాళులర్పించారు. ఈ కార్యక్రమం ద్వారా టంగుటూరి ప్రకాశం పంతులుగారు సేవలను దేశానికి చేసిన అమూల్యమైన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ విజయ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు



మాట్లాడుతున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

గ్రామాలు బాగుపడితేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లి బిట్-1 పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సభా ప్రాంగణానికి చేరుకున్న ఎంపికి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాల కల్పన కోసం గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు జరుగుతుండటం ఒక చరిత్ర అని వ్యాఖ్యానించారు. గత ఐదేళ్ల వైసిపి పరిపాలనలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. సర్పంచులు, వార్డు మెంబర్లు ఒక్క పని కూడా చేయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. కనీసం రోడ్లు, లైట్లు వేసుకోవడానికి కూడా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి పట్టించిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర, ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి ఈ సభలను ఏర్పాటు చేశాయన్నారు. స్థానికంగా గ్రామాలకు ఏ అవసరాలు ఉన్నాయో ఈ గ్రామసభల ద్వారా గుర్తించి వాటిని ఆమోదించుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేని కారణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రంతో ఉన్న సన్నిహిత సంబంధాలతో నిధులను సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో ఏయే పనులు చేశారు.. ఇంకా ఏం చేయాలి.. వంటివి ఈ సభల ద్వారా ప్రజల ముందుకు వస్తాయన్నారు. కాబట్టి ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకుపల్లి సుభాషిణి, ఎంపిడిఒ వీ. శైలేంద్ర కుమార్, ఉప్పల ఈశ్వరయ్య, కుడుముల నాగేశ్వరరావు గౌడ్, కాకుపల్లి శివ, పంచాయతీ కార్యదర్శి పి.అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్, ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కలిగిరి మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. కలిగిరి మండలంలోని అనంతపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన మండల అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ తీర్మానాలను ప్రజలకు వివరించారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు గ్రామసభలో పంచాయతీలోని చేయాల్సిన ముఖ్యమైన పనులను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిపి మెట్టుకూరు శిరీష, ఎంపిడిఒ రంగసుబ్బరాయుడు, మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, పంచాయతీ నోడల్ అధికారి పిఆర్ఎఇ, ఇఒపిఆర్‌డి వెలుగోటి మధు, పంచాయతీల కార్యదర్శులు, ఇతరశాఖల అధికారులు టిడిపి కూటమి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో మండలంలోని 24 పంచాయతీల్లో శుక్రవారం ఒకేరోజు నిర్వహించిన గ్రామసభలు విజయవంతమయ్యాయి. గ్రామసభల్లో అధికారులు మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని స్వర్ణ గ్రామంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మంచినీటి కొళాయిలు ఏర్పాటు, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంకులు, అంతర్గత రోడ్లు, గ్రామాలు, పట్టణాల మధ్య అనుసంధానంపై గ్రామ అవసరాలు తీర్చడంతో పాటు గ్రామంలో ఎటువంటి సమస్యలున్నాయో గ్రామసభల్లో గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. సింగనపల్లి, నాగినేని గుంట, బూదవాడ, ఏపిలికుంట పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో సర్పంచ్ లు గీత, హరిబాబు, సంతోషమ్మ, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు తెలిపిన పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఉపాధి హామీ వ్యవసాయానికి అనుసంధానం చేయడం జరిగిందని ప్రజలు ఊయోగించు కోవాలన్నారు. సింగనపల్లిలో ఉపాధి హామీ పనులు నెలరోజులు నుండి జరగడంలేదని ఎపిఒ వెంకటనారాయణను నిలదీశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను పక్కన పెట్టడంతో పనులు నిలిచి పోయాయన్నారు. పనిదినాలు పెంచి పనులు మొదలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, సత్యం, లక్ష్మి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతసాగరం : గ్రామాలలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి జరిగిన గ్రామసభలో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులు కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్, ఉపాధి హామీ సిబ్బందికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ ఉపాధిహామీ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీలు తీర్మానలు చేసి ఉపాధిహామీ పనులు పెట్టాలన్నారు. ఉపాధిహామీ పనిదినాలు పెంచాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని, చేసిన పనులకు వారంవారం వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామసభలో తీర్మానం చేసిన ఉపాధి హామీ పనులను ఎలాంటి అవినీతికి తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ కూలీలు ఖాసిం, సమద్, మునిర్, ఇస్మాయిల్, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

చవటపుత్తేడు ఇక 'బృందావనం'

ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని చవటపుత్తేడు గ్రామ పంచాయతీ పేరును బృందావనంగా మార్పు చేయాలని గ్రామ ప్రజలు గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామంలోని ప్రజలందరూ ఏకతాటిపై నిలబడి గ్రామం పేరును మార్పు చేయాలని గ్రామసభ అధ్యక్షత వహించిన మండల అభివృద్ధి అధికారి శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చమటపుత్తేడు పేరు పలుకుటకు ఇబ్బందికరంగా అసభ్యకరంగా ఉన్నందున మార్పు చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సమీపంలోని పెద్దపుత్తేడు గ్రామ పంచాయతీని శ్రీరామపురం గ్రామ పంచాయతీగా మార్పు చేసిన విషయాన్ని వారు అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై గ్రామ సభలో గ్రామ ప్రజల తీర్మానాన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్ బోర్డు సభ్యుల తీర్మానాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకుని వెళతామని అధికారులు తెలిపారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులి కళ్యాణి, గ్రామ టిడిపి నాయకులు పులి సీనయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని 24 పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు ప్రశాంతంగా ముగిశాయి. వరికుంటపాడులో ఎంపిడిఒ మల్లికార్జున, టిడిపి మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర మధుసూదన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో నేటి నుంచి గ్రామీణ అభివద్ధి పనులు గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గ్రామసభలు ఏర్పాటు చేసిందన్నారు. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి దూరం చేసిందని గ్రామసభల ద్వారా గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గురించి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : మన గ్రామాల అభివృద్ధి ఇప్పుడు మన చేతుల్లోనే ఉందని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల వేతన ఉపాధి చూపించబడునని, గ్రామంలోని ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు అందేలా చూస్తామని తెలిపారు. పని కోరిన 15 రోజుల్లోనే పని పొందే హక్కు కల్పిస్తున్నామని, 15 రోజుల్లోపు పని కల్పించనట్లయితే పని కోరిన తేదీ నుంచి నిరుద్యోగ భృతి పొందే హక్కు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ఎపిడి మృధుల, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎపిఒలు, పోలీస్ అధికారులు సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై 17 పంచాయతీల్లో జరిగిన గ్రామసభలు విజయవంతం అయ్యాయి. శుక్రవారం మండల పరిధిలోని మిట్టపల్లిలో గ్రామసభలో ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ అని శాఖల అధికారులు సర్పంచ్ వెంకటస్వామి నాయుడు అధ్యక్షతన గ్రామ ప్రజలతో కలిసి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో గ్రామంలో చేపట్టవలసిన పనులను గ్రామ ప్రజలు గుర్తించి ఆ పనులు మాత్రమే చేయడానికి ఈ గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కృష్ణంపల్లి గ్రామంలో గ్రామసభను సర్పంచ్ అక్కి ప్రమీల, స్పెషల్ ఆఫీసర్ వేణు, కార్యదర్శి శిల్ప, సచివాలయం ఇబ్బంది పాల్గొని సమావేశం నిర్వహించి ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు

ప్రజాశక్తి-కావలి : గ్రామాల అభివృద్ధి ఇప్పుడు ప్రజల చేతుల్లోనే ఉందని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల వేతన ఉపాధి చూపించబడునని, గ్రామంలోని ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎ.పి.డి మృదుల, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎపిఒలు, సంబంధిత అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి గ్రామసభలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని పంచాయితీల్లో ఒకేరోజు ఉపాధి గ్రామసభలు శుక్రవారం నిర్వహించారు. అనంతరం స్థానిక మండల కేంద్రంలోనీ సర్పంచ్ శోభా మాట్లాడుతూ నియంతగా ఎవ్వరి ప్రమేయం లేకుండా కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించడం సరైన పద్ధతికాదని ఈ తీర్మానాలపై సంతకాలు పెట్టబోమని అధికారులపై రుసరుస లాడడం చర్చనీయంశమైంది. గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట సర్పంచ్ గండూరి మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాలపాటి నాగేశ్వరరావు, ఎంపిటిసి ఎకె సుందర్ రాజ్, ఉప సర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు బొంత సుధీర్, చిలక జయరాం, భారతి, పద్మ, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, టిడిపి నాయకులు లేళ్ళపల్లి కిషోర్‌బాబు, శ్రీధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కోవూరు : గ్రామాల్లో ఉపాధి హామీ చట్టాన్ని మరింత బలోపేతం చేసి ఉపాధి కూలీలకు పని కల్పించాలని జాబు కార్డులు ఇవ్వాలని రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని సంవత్సరానికి 200 దినాలు కనిపించాలని అదేవిధంగా గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు విజయ్ కుమార్ బట్ట పెద్దబ్బయ్య పాటూరు గ్రామ, పోతిరెడ్డి పాలెంలో జరిగిన గ్రామ సభలో సభలో మాట్లాడి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గండవరపు సురేష్, పూనామల్లి, జానకి రామయ్య, అత్తిపాటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలంలో ఉపాధి హామీ పనులపై జరిగే గ్రామ సభలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కావలి మండలం చెంచుగానిపాలెం పంచాయతీలో శుక్రవారం మండల అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, రైతుసంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఉపయోగపడే పనులను మాత్రమే గుర్తించాలని ఉపాధి చట్టంలో పొందుపరచిన చాలా పనులు కనుమరుగయ్యాయన్నారు. అధికార పార్టీ నాయకులు కనుసన్నల్లో గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని, ఉపాధి కూలీలకు సక్రమంగా 100 రోజులు కూడా పనులు కల్పించటం లేదన్నారు. ఉపాధి కూలీలకు పని అడిగిన ప్రతి ఒక్కరికి 200 రోజులు పని దినాలు రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు, గుడాలు, సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. గ్రామాలలో పనులు చేపట్టడానికి ఐదు ఎకరాలు నుండి పది ఎకరాలు వరకు పెంచాలన్నారు. పండ్ల తోటలు పెంపకానికి ఐదు ఎకరాల సీలింగ్ పది ఎకరాల వరకు పెంచాలని వారు కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు గోపసాని రమేష్

ప్రజాశక్తి-దగదర్తి : ప్రభుత్వం ఉపాధి హామీపై గ్రామసభలు నిర్వహించి ఏ పనులు చేసుకుంటే బాగుంటాయని ప్రజలందరూ కలిసి ఒక మాట మీద వచ్చిన తర్వాత ఆ పనులు మాత్రమే ఉపాధి హామీ పనుల్లో చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దానిపై అధికారులు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అనంతరం గ్రామసభకు హాజరైన సిపిఎం నాయకులు గోపసాని రమేష్ వినతి పత్రాన్ని ఇఒపిఆర్‌డికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పని దినాలను 100రోజుల నుంచి 200రోజులకు పెంచాలని అదేవిధంగా కూలీలకు వచ్చే వేతనం రూ.300 నుంచి రూ.600 పెంచాలన్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు ఉపాధి హామీ ద్వారా రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పొలాల్లోకి పోయే రోడ్లు గుంటల ఏర్పడి ఉన్నాయని గుంతలకు మట్టి ఉపాధి హామీ కూలీలు చేతనే పుడిపించాన్నారు. ప్రభుత్వం పశువులు గొర్రెలు, మేకలు, షెడ్డులను నిరుపేద రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఉపాధి హామీ జాబ్ కార్డు కల్పించాలన్నారు. గతంలో ఉపాధి కూలీలకు వేతనాలు అందగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి వేతనాలు అందజే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు నగరంలోని ఆదిత్య నగర్‌లోని ఎస్‌పి బాలసుబ్రమణ్యం పార్కులో ఉచిత కంటి వైద్య శిబిరం డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ స్థానిక కమిటీ నాయకులు రాజేష్ మాట్లాడుతూ డివైఎఫ్‌ఐ పోరాటంలోనే కాకుండా సేవా కార్యక్రమంలోనూ ముందుంటుందని చెప్పారు. ప్రజలకి ఏ సమస్య వచ్చినా దాని పరిష్కారం కోసం నిత్యం ప్రజలతో ఉంటుందన్నారు. ప్రజల మధ్య జీవిస్తూ వాళ్ల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందని చెప్పారు. స్థానికంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని రాబోయే రోజుల్లో ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. సైడ్ కాలువల్లో పూడిక తీయక పోవడం వల్ల దోమల సమస్య విపరీతంగా ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు ఆ సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని కోరారు. విష జ్వరాలు వల్ల పేద ప్రజలు వేలాది రూపాయలు ఆస్పత్రుల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఈ దోమల వల్ల కలుగుతుందన్నారు. వెంటనే దోమల సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ మాజీ నాయకులు శ్రీనివాసులు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార లోపాన్ని అధిగమించొచ్చు..

ప్రజాశక్తి-కావలి

కష్టజీవులు, నిరుపేదలు మునగాకును భుజించడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించి ఆరోగ్యంగా జీవిస్తారని సామాజికవేత్త ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. శుక్రవారం ముసునూరు కొత్త గిరిజన కాలనీలో గిరిజనులకు మునగాకు విశిష్టతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాలకొండారెడ్డి మాట్లాడుతూ మునగాకును ఆహారంలో అధికంగా తీసుకోవడం ద్వారా మధుమేహం, కీళ్ల నొప్పులు, గుండె ఆరోగ్యం, రక్తపోటు, కాలేయం దెబ్బ తినడం, కడుపు పుతాలు, కేన్సర్ అతిసారం వంటి రోగాలను నీయంత్రించవచ్చని తెలిపారు. మునగాకులో విటమిన్‌లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పేద ప్రజలు, కష్ట జీవులు ఈ ఔషధ గుణాలు కలిగిన మునగాకును ఆహారంలో అధికంగా తీసుకోవడం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధిగమించి ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. మునగ కాయలు, మునగాకును ఎక్కువగా ఉపయోగించు కోవాలని కోరారు. మునగ కాయలును పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

అక్షరాస్యత కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-అనంతసాగరం

మండల కేంద్రంలోని అక్షరాస్యత కేంద్రాన్ని కెనరా బ్యాంక్ మేనేజర్ నోడల్ అధికారి బితేష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ జనధన్ ఖాతా కలిగి ఉండాలని, రూపే ఎటిఎం కార్డు ఉపయోగించాలి, అలానే ప్రతి కుటుంబంలో బీమా పథకాలు, అకౌంట్ కలిగి ఉండాలని, డిజిటల్ పేమెంట్స్ ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు జరుపుతూ ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు.

న్యాయవాదుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కావలి

కోల్‌కతా అర్‌జికర్ హాస్పిటల్లో డ్యూటీ చేస్తున్న జూనియర్ డాక్టర్ మౌమితపై సామూహిక మానభంగం, హత్యకు కారకులైన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలని కోరుతూ, శుక్రవారం కావలి న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కోర్టు భవనాల ఆవరణం నుండి ట్రంక్ రోడ్డు మీదుగా ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు వీరి నిరసన ప్రదర్శన సాగింది. మౌమితపై హత్యాచారానికి తగిన న్యాయం జరిపించాలని, పనిచేస్తున్న చోటే మాన, ప్రాణాలను హరిస్తుంటే మహిళా ఉద్యోగులకు రక్షణ ఎక్కడ.. అంటూ న్యాయవాదులు రోడ్డెక్కి నినదించారు. కార్యక్రమంలో కావలి బార్ ప్రెసిడెంట్ సురేంద్రరెడ్డి, సెక్రటరీ జయప్రకాశ్, న్యాయవాదులు ఇస్కల సాయిప్రసాద్, అభిసాగర్, జగన్‌మోహన్ రావు, జె.శీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి

ప్రజాశక్తి-కావలి

శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కె.ఎస్.కె. అంజాద్ ఆలీ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి, విద్యార్థినీ విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలను వివరించి చెప్పారు. ఎన్.సి.సి. ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు అంటేనే నిరాడంబర జీవితం గుర్తుకు వస్తుందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్జన చెయ్యకూడదనే దానికి నిలువెత్తు నిదర్శనం ప్రకాశం పంతులు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శార్వాణి, ఐ.శ్రీనివాసులు, ఎస్.కె.సాబిర, ఎ.శ్రీలక్ష్మి, కె.విజయలక్ష్మి, బి.సుమన, ఎసురత్నం, సుబ్బయ్య, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుభద్ర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి కోవూరు : స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగం చిరస్మరణీయమనిఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా కోవూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ వేదికపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన ప్రకాశం పంతులు నిస్వార్థ జీవితం భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుస్మితా రెడ్డి, కోవూరు ఎంపిడిఒ శ్రీహరి, తహశీల్దారు నిత్యానంద బాబా, ఎంపిపి పార్వతి, జెడ్‌పిటిసి శ్రీలత, కోవూరు సర్పంచ్ యాకసిరి విజయ, ఎంపిటిసి నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, లేగుంటపాడు సర్పంచ్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, నాటకరాణి వెంకట్ పాల్గొన్నారు.

కక్ష సాధింపు తగదు..

ప్రజాశక్తి-ఉదయగిరి

మాట్లాడుతున్న డాక్టర్ ఠాగూర్

సిబ్బందిని బట్టి లీవులు ఇవ్వాలని సలహా ఇస్తే, కక్ష సాధింపు చర్యలు తీసుకునేందుకు తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని డాక్టర్ ఠాగూర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించడమే తన కర్తవ్యం ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి దీనస్థితిలో ఉన్న ఉదయగిరి మెట్టప్రాంత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఎటువంటి సమస్యలతో వచ్చిన పేషంట్లను వైద్యులు సిబ్బంది ఆత్మకూరు, నెల్లూరుకు రెఫర్ చేస్తూ పంపిస్తుండడం సహించలేక అడిగినందుకు గ్రూపులుగా కక్షగట్టి పత్రికల్లో వార్తలు రాయిస్తూ జిల్లా ఉన్నతాధి కారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సిబ్బంది వారికి మించి సెలవులు ఉపయోగించుకున్నారని ఒకసారి పరిశీలనలో చేస్తే నిజాలు చేరుతాయన్నారు. గతంలో ఫార్మసిస్ట్ మందులు తీసుకు వెళ్తున్నట్లు సంబంధచిన అధికారులకు తెలిపిన వారిపై ఇంతవరకు చర్యలు లేక పోవడంపై అలాంటివారు తనపై దుష్ప్రచారం చేస్తూ ఇలాంటి వాటికి పాల్పడుతున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న తనపై వరుసగా వస్తున్న ఆరోపణలలో నిజం లేదని తాను ఎవ్వరినీ వేధించడం లేదని, విధులు మాత్రమే నిర్వహించాలని సూచించినందుకు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనపై వస్తున్న కథనాలు నిజమని నిరూపిస్తే స్వచ్ఛందంగా వెళ్లిపోతానన్నారు.

Before The Honourable Deputy Registrar of Chits at Nellore
(Application for reference of a Dispute)
Dispute No. 09 of 2021
M/s. Sri Sai Anjana Chit Funds India Pvt., Ltd., Nellore Branch, SPSR Nellore District. - Disputant
Versus
1. Shaik Masthan and 3 Others - Opponents
Notice
To,
Opp-1. **Shaik Masthan,** S/o **Masthan Saheb,** Residing at. D.No.33/981-100, Vijaya Milk Dairy, Venkateswarapuram, Nellore Rural Mandal, SPSR Nellore District.
Opp-3. **Nelaturu Bujjaiah,** S/o **Thirupalaiah,** Residing at Vigneswara Colony, Podalakur Village & Mandal, SPSR Nellore District.
Opp-4. **Shaik Noorjahan,** W/o **Masthan,** Residing at D.No.33/981-100, Vijaya Milk Dairy, Venkateswarapuram, Nellore Rural Mandal, SPSR Nellore District.
పై నెంబరున డిస్‌ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు లో మీకు నోటీసునిమిత్తం **తే30-08-2024దికి** వాయిదా వేసియున్నారు.కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారాగానీ పైన తెలిపిన డిప్యూటీ రిజి స్ట్రార్ ఆఫ్‌చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
జలదంకి సురేష్‌బాబు, బి.కాం., ఎల్.ఎల్.బి., డిస్‌ప్యూటెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.